నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 16 మే 2025 | ADILABAD NIRMAL

మలేషియా జైలులో ఉన్న కార్మికులకు భరోసా

మలేషియా జైలులో ఉన్న కార్మికులతో మాట్లాడుతున్న భూక్యా జాన్సన్ నాయక్

ఖానాపూర్, మే 15 : కడెం మండలంలోని లింగాపూర్‌కు చెందిన రాచకొండ నరేశ్, శ్రీనివాస్.. దస్తురాబాద్ మండలం మున్యాలకు చెందిన రవీందర్ మలేషియాలోని జైలులో కొంత కాలంగా మగ్గుతున్నారు. జైలులో అవస్థలు పడుతున్నామని బాధిత కుటుంబీకులు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్‌కు విలపిస్తూ చెప్పారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతో స్పందించిన ఆయన వారిని స్వదేశానికి తీసుకురావాలని బాధితుల కోసం మూడు రోజుల క్రితం మలేషియా దేశానికి వెళ్లారు. గురువారం 'నమస్తే తెలంగాణ'కు ఒక ప్రకటనలో వారి వివరాలు తెలిపారు. అకారణంగా జైలులో ఉన్న ముగ్గురిని సొంత డబ్బుతో న్యాయవాదులను సంప్రదించి, ఇంటికి చేరుకునేలా కృషి చేస్తున్నట్లు భరోసా కల్పించారు. ప్రస్తుతం వారిని జైలులో కలిసి స్థితిగతులు తెలుసుకున్నారు. త్వరలో స్వదేశానికి తీసుకువెళ్తానని తెలిపారు.

జాబితా తయారు చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 15 : రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను బ్యాంకులు, ఎంపీడీవోలు నాలుగు రోజుల్లో పరిశీలించి ఎలిజిబుల్, నాన్ ఎలిజిబుల్ జాబితాను తయారు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, బ్యాంక్ మేనేజర్లు, అధికారులతో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 19వ తేదీలోగా పరిశీలన జరపాలని సూచించారు. 48,296 దరఖాస్తులు రాగా.. ఇందులో 43,417(డెస్క్ వెరిఫికేషన్) మండల స్థాయిలో పరిశీలించామని తెలిపారు. బ్యాంకుల ద్వారా జాబితా పూర్తయిన తర్వాత ఎంపీడీవోలు ఫైనల్ జాబితా తయారు చేసి పంపాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, సీఈవో జితేందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు పాల్గొన్నారు.

దొంగల దాడిలో గాయపడ్డ రైతు దిలీప్‌రెడ్డి

దొంగలు కొట్టారు.. తలకు గాయమైంది..

నేను 15 క్వింటాళ్ల జొన్నలను అమ్మడానికి సోమవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చా. పంటను కొనమని పీఏసీఎస్ సిబ్బందిని వేడుకున్న పట్టించుకోలేదు. దీంతో పంటకు కాపలాగా హోటల్ నుంచి తిండి తెచ్చుకుంటూ పంటకు కాపలాగా ఇక్కడే ఉంటున్నా. బుధవారం రాత్రి దొంగలు పంటను ఎత్తుకుపోవడానికి వచ్చినప్పుడు వారు నాపై దాడి చేశారు. తలకు గాయాలయ్యాయి. మార్కెట్ యార్డులో రైతులకు భద్రత లేదు. పంట కొనగోళ్లలో జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటే రైతులకు ఇబ్బందులు ఉండవు. - దిలీప్‌రెడ్డి, రైతు, రాంపూర్, సాత్నాల మండలం

తలకు అయిన గాయాన్ని చూపిస్తున్న రైతు నారాయణ

రైతులపై దొంగల దాడి

ఇద్దరిపై బండలు, కర్రలతో కొట్టడంతో తలకు తీవ్ర గాయాలు

- జొన్నలను ఎత్తుకెళ్తుండగా అడ్డుకున్న అన్నదాతలను చితకబాదిన దొంగలు
- కాంగ్రెస్ సర్కారు పంటను కొనుగోలు చేయకపోవడంతో దుస్థితి
- భద్రతా సిబ్బందిని నియమించాలని.. కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతుల వేడుకోలు..

ఆదిలాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో అన్నదాతల పరిస్థితి 'ముందు నుయ్యి, వెనుక గొయ్యి'లా తయారైంది. మార్కెట్ యార్డుకు తీసుకొస్తున్న జొన్న పంటను కొనుగోలు చేయడంతో జాప్యం ఫలితంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుకు ఆదిలాబాద్, ఆదిలాబాద్ రూరల్, మావల, తలమడుగు, భోరజ్, సాత్నాల మండలాలకు చెందిన రైతులు జొన్నలను విక్రయించడానికి వస్తున్నారు. 20 రోజుల కిందట ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో మద్దతు ధర క్వింటాలుకు రూ.3371 చొప్పున జొన్నలను సేకరిస్తున్నది. దిగుబడి బాగా రావడంతో మార్కెట్ యార్డు జొన్నల రాశులతో కళకళలాడుతున్నది. కొనుగోలు కేంద్రాల సిబ్బంది తేమ, నాణ్యత పేరిట కొనుగోళ్లను తిరస్కరిస్తున్నారు. కొనుగోలు చేసిన జొన్నలను లారీల్లో గోదాములకు పంపడంలో ఆలస్యం అవుతున్నది.

పంట దొంగల పాలు

పంట కొనుగోళ్లలో జాప్యం ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. పంటను అమ్ముకునేందుకు రైతులు రోజుల తరబడి మార్కెట్ యార్డులో పడిగాపులు కాయాల్సి వస్తున్నది. పీఏసీఎస్ తిరస్కరించిన జొన్నలను ఆరబెట్టడం, జల్లెడ పట్టడం, జొన్నల సంచులు ఖాళీ అయ్యేంత వరకు మార్కెట్ యార్డులోనే ఉండాల్సి వస్తుంది. కష్టపడి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు రైతులు మార్కెట్ యార్డులో రాత్రి, పగలు పంటకు కాపలా కాస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు పంటతోపాటు రైతులకు భద్రత కల్పించకపోవడంతో దొంగలు పెట్రేగిపోతున్నారు. రాత్రి సమయంలో పంటను ఎత్తుకుపోతున్నారు. అడ్డుకున్న రైతులపై దాడులకు పాల్పడుతున్నారు. బుధవారం రాత్రి దొంగలు సాత్నాల మండలంలోని రాంపూర్‌కు చెందిన దిలీప్‌రెడ్డి, తలమడుగు మండలం బరంపూర్‌కు చెందిన నారాయణలపై బండలు, కట్టెలతో దాడి చేయడంతో ఇద్దరి తలలకు గాయాలయ్యాయి. దొంగల వల్ల భయం ఉందని మార్కెటింగ్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. పంట దొంగలపాలు కాకుండా కొనుగోళ్లను వేగవంతం చేయడంతోపాటు భద్రత సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

జొన్నలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

అన్నదాతలకు రక్షణ లేదు

- మాజీ మంత్రి జోగు రామన్న
- మార్కెట్ యార్డు సందర్శన

ఎదులాపురం, మే 15 : పంటలు అమ్ముకునేందుకు వచ్చిన అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కనీసం రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో జొన్నల కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం రాత్రి కొంతమంది రైతులపై దాడి కి పాల్పడ్డారు. నాలుగు రోజులుగా జొన్నల కొనుగోళ్లు జరపకపోవడంతో ఇక్కడే ఉం డాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశా రు. జొన్నలు దొంగతనం చేయడానికి వచ్చిన వారిని పట్టుకుంటే మరికొంత మంది వచ్చి దాడి చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రామన్న మార్కెట్ యార్డులో బాధిత రైతులను పరామర్శించారు. రైతులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. సెంటర్ ఇన్‌చార్జితో మాట్లాడి స్థానికంగా కల్పిస్తున్న భద్రతను అడిగి తెలుసుకున్నారు. కనీస రక్షణ లేకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు రామన్న మాట్లాడుతూ.. గతంలో పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరిగేవన్నారు. ప్రస్తుతం సంబంధిత అధికారులు లేకపోవడంతోనే దాడి జరిగిందని ఆరోపించారు. రైతులపై దాడి చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు అలాల్ అజయ్, మెట్టు ప్రహ్లాద్, అశోక్, అడపా తిరుపతి, మహేందర్, మోబిన్, కుమ్ర రాజు, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల సమస్యలను ప్రభుత్వానికి విన్నవిస్తాం

- జిల్లా సంక్షేమ అధికారి కె మిల్కా

ఎదులాపురం, మే 15 : ట్రాన్స్‌జెండర్ల సమస్యల గురించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ అధికారి మిల్కా అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో గురువారం ట్రాన్స్‌జెండర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిల్కా మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌జెండర్ కార్డు ఇప్పటి వరకు తీసుకోని వారు తప్పక తీసుకోవాలన్నారు. రిమ్స్‌లో మైత్రీ క్లినిక్ ఏర్పాటు చేశామని, ప్రతి మంగళ, గురువారాల్లో సేవలు ఉపయోగించుకోవాలన్నారు. డ్రాపౌట్ అయిన వారు చదువుకోవాలని, ఇష్టం ఉన్నవారికి ఓపెన్ టెన్త్, ఇంటర్, డిగ్రీ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్స్ కామేశ్వరి, అలిజా, హర్షిత, కావ్య, మైత్రి క్లినిక్ కౌన్సిలర్ లావణ్య, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ యశోద పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి మిల్కా

పంటను కొనుగోలు చేయాలని పీఏసీఎస్ సిబ్బందిని వెంట తిరుగుతున్న రైతులు

- అత్యాశకు వెళ్లి అడ్డంగా దొరికిన యువత

డ్రగ్స్ ముఠా అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, మే 15 : సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో డ్రగ్స్ విక్రయిస్తున్న నలుగురు యువకులు పోలీసులకు అడ్డంగా దొరికిన ఘటన నిర్మల్ జిల్లాలో చోటు చేసుకున్నది. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. నిర్మల్ పట్టణానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్‌లు షేక్ ఫర్ధీన్, మహ్మద్ పర్వేజ్(విద్యార్థి), చౌహాన్ గోవింద్, మహ్మద్ అబ్ధుల్ డానిష్‌లు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మిడజోలం ఇంజక్షన్‌ను యువకులకు అలవాటు చేశారు. షేక్ ఫర్ధీన్ ల్యాబ్ టెక్నీషియన్‌గా మూడేండ్లుగా పనిచేస్తున్నాడు. మెడిసిన్‌పై అవగాహన ఉండడంతో యూట్యూబ్ ద్వారా మిడజోలం ఇంజక్షన్‌ను ఎలా తీసుకోవాలో తన స్నేహితులకు తెలుపగా వారు ఈ వ్యాపారానికి ఒప్పుకున్నారు. ఈ క్రమంలో మహ్మద్ పర్వేజ్ కస్టమర్ల దగ్గరికి వెళ్లి కస్టమర్లను తీసుకుని నిర్మల్‌లోని బైల్ బజార్‌కు తీసుకొచ్చారు. అక్కడ వారికి విక్రయిస్తున్న సమయంలో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 26 ఇంజక్షన్‌లను 10 సిరంజన్‌లను, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు సంబంధించి 8712659599 నంబర్‌కు సమాచారం అందించాలని అన్నారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ రాజేశ్ మీనా, ఉపేందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్ ఉన్నారు.

నిర్మల్ మండలం తాంశలో ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పిన రైతులు

ఎక్కడి ధాన్యం అక్కడే..

కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు తెప్పలుగా ధాన్యపురాశులు

- నత్తనడకన కొనుగోళ్లు.. తూకం వేయడంలో జాప్యం..
- హమాలీల కొరతతోపాటు అరకొరగా లారీలు
- ఉరుములు, మెరుపులతో రైతన్న గుండెల్లో గుబులు
- రోజుల తరబడి కుప్పల వద్ద పడిగాపులు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న అన్నదాతలు

నిర్మల్, మే 15 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు అరిగోస పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోపాటు ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. 20 రోజులుగా పది శాతానికి మించి కొనుగోళ్లు చేయలేదంటే అర్థం చేసుకోవచ్చు. కొన్ని చోట్ల కేంద్రాలను ప్రారంభించినా.. నేటికీ ఒక్క బస్తా కోనుగోలు చేయలేదు. ఫలితంగా ఎక్కడి ధాన్యం అక్కడే కనిపిస్తున్నది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 1,17,085 ఎకరాల్లో వరి సాగైంది. ఈ సీజన్‌లో 1.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో 1.38 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డురకం, 24 వేల మెట్రిక్ టన్నులు సన్నరకం దిగుబడులు వస్తాయని ప్రణాళికలో పేర్కొన్నారు. ఇందులో కొంతవరకు స్థానిక అవసరాలకు పోను 1,62,414 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వస్తుందని అంచనా వేశారు. అందుకు అనుగుణంగా 330 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటివరకు కేవలం 189 కేంద్రాల్లోనే కొనుగోళ్లను చేపడుతున్నారు. వీటిలో 97 ఐకేపీ సెంటర్లు, 88 పీఏసీఎస్, 4 జీసీసీ కేంద్రాలు ఉన్నాయి. ఈ యాసంగి ధాన్యం సేకరణ లక్ష్యం 1,62,414 మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటివరకు కేవలం 52,072 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డురకం 40,884 మెట్రిక్ టన్నులు, సన్నరకం 11,118 మెట్రిక్ టన్నులుగా ఉన్నది. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.120 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.19 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేశారు. అంటే ఇంకా దాదాపు రూ.100 కోట్ల వరకు చెల్లించాలి.

పేరుకుపోయిన వడ్ల కుప్పలు

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతోపాటు ఎటూ చూసినా వడ్ల కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఒకవైపు ఉరుములు, మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. పది రోజులుగా రోజు జిల్లాలో ఎక్కడో ఒక చోట వర్షం కురుస్తూనే ఉన్నది. బుధవారం తెల్లవారుజామున నిర్మల్ మండలం కౌట్ల(కే), తాంశ, ముజ్గి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు వడ్ల కుప్పలపై టార్పాలిన్లను కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. 20 రోజులుగా ఇక్కడి సెంటర్‌కు వడ్లను తీసుకొచ్చామని, ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదని తాంశ గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు. ధాన్యం తేమ శాతం వచ్చినప్పటికీ ఎప్పుడు కొంటారోనని ఎదురుచూస్తూ రోజుల తరబడి వడ్ల కుప్పల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. అకాల ముప్పుతో ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం తాంశ గ్రామంలో వర్షం కురియడంతో ఆందోళన చెందిన రైతులంతా కలిసి కేంద్రం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. వడ్లను కొంటరా? కొనరా? అంటూ నిలదీశారు. హమాలీల కొరత కారణంగా కొనుగోళ్లు చేపట్టలేకపోతున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కనీసం గన్నీ బ్యాగులైనా ఇస్తే తామే వడ్లను నింపుకుంటామని కొందరు రైతులు మొర పెట్టుకున్నా కేంద్రాల నిర్వాహకులు బ్యాగులు ఇవ్వడం లేదు. మరోవైపు వడ్లను తరలించేందుకు లారీల కొరత ఉన్న కారణంగా కావాలనే కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇబ్బడి ముబ్బడిగా వస్తున్న ధాన్యాన్ని మిల్లర్లు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఇలా అనేక రకరకాల కొర్రీలతో కొనుగోలు ప్రక్రియ మందకోడిగా సాగుతున్నది. గత కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ రాలేదని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ప్పటి నుంచే కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని రైతులు మండిపడుతున్నారు.

అధికారులు స్పందించాలి..

కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత ఉన్నది. తూకం వేయడంలో జాప్యం జరుగుతున్నది. ఇక్కడి సెంటర్‌కు 20 రోజుల క్రితం వడ్లు తీసుకొచ్చిన. తేమశాతం వచ్చినా తూకం వేయకపోవడంతో రోజుల తరబడి కుప్పల వద్దనే పడిగాపులు కాస్తున్నం. ఇప్పటికైనా అధికారులు స్పందించి హమాలీల కొరత తీర్చాలి. వచ్చే నాలుగైదు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు ఉన్నయంటున్నరు. కష్టపడి పండించిన ధాన్యం వర్షం పాలు కాక ముందే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

- వీ మహేశ్‌రెడ్డి, రైతు, తాంశ

కేసీఆర్ ఉన్నప్పుడే బాధ లేకుండే..

నాకు సొంతంగా రెండెకరాల పొలం ఉన్నది. ఇతరులది ఐదెకరాలు కౌలుకు చేసిన. 7 ఎకరాల్లో వడ్లు పండించిన. ఏడు ట్రాక్టర్ల దాకా పంట దిగుబడి వచ్చింది. అమ్ముకుందామని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. వారం రోజులైంది. ఎవరూ పట్టించుకునేటోళ్లే లేరు. ఎప్పుడు కొంటరో తెల్వదు. కుప్పలు పోసి కవర్లు కప్పి పెట్టిన. రోజు రాత్రి కావలికి వస్తున్న. కేసీఆర్ ఉన్నప్పుడు రైతులకు ఏ బాధ లేకుండే. అన్ని మంచిగ చేసిండు. ఈ కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి రైతులకు అన్నీ కష్టాలే..

- అశోక్, కౌలు రైతు, తాంశ